మరీ చూపిం చింది. వాళ్ళందరికి ఆఫీసరు భార్య. ఆమెకు కావేశం అంటే ప్రత్యేకాభిమానం, అతను అమాయకుడని. అదీ కాక అతనితల్లి వాళ్ళయింట్లో సమయాసమయాల్లో వంట చేసి వాళ్ళకి సహాయం చేసేది.

'ఏం కావేశంగారూ ! ఎలా వున్నాడు మావాడు?' అంది, వాళ్ళవాడ్ని కావేశం మొహం దగ్గరగాపెట్టి వాళ్ళ వాడు ఆవలిం చేడు. ఇంత సేపటికి అతన్ని మాట్లాడమన్న ఆహ్వానం వచ్చింది.

"దివ్యంగా వున్నాడు దీపంలా. అందగాడు మీలాగే- (ఆఫీసరు కనుబొమ్మలు మీదికి వెళుతున్నాయి). చురుక్కి మా ఆఫీసరుగారే ఐనా అందానికి మిమ్మల్నే పోలాడు. నిజం చెప్పా లంటే మీరు చాలా అందంగా వుంటారు--(పళ్ళు పట పట లాడుతున్నాయి.) మీరు చాలా చిన్న పిల్లలావుంటారు. (పిడి కిళ్ళు బిగిస్తున్నాయి) నిజానికి మీరు ఆఫీసరుగారి భార్యని ఎవరూ అనుకోరు మీరు..

విశ్వనాధం కామేశం కాలిమీద తన్ని అతని నోరు మూశాడు.

కావేశం చెప్పింది అక్షరాలా నిజం. పొగడ్తేంలేదు. ఆఫీసరు గారికి రెండో వివాహం. అతనిభార్య అందగత్తే. చిన్నదీ కూడా. నిజంచెప్తే ఎందుకు విశ్వనాధం తన కాలు నలిపేశాడో తెలీక కామేశం అందర్నీ కలియచూశాడు. ఆఫీసరుగారి భార్య కొంప లంటుకున్నట్టు పిల్లణ్నెత్తుకొని పారిపోతూంది. అంతా ఎప్పుడు పేల్తుందో తెలీని ఏటం బాంబుని పట్టుకున్నట్టున్నారు. ఆఫీసరు పేలబోయే ఏటంబాంబులా పొగకక్కి పేలాడు 'టేక్ హిమ్ ఎవే బిఫోర్ ఐ కిల్ హిమ్'.

హత్య జరిగినట్లున్న వాతావరణంలో ఎవరూ శలవు తీసు కోకుండానే కావేశాన్ని యీడ్చుకుపోయారు. గేటు దాటగానే 'రేపు ఆఫీసు కిన్ని నువ్వులు పట్రా, ఉద్యోగానికి నీళ్ళొదిలేద్దువు గాని' అని విశ్వనాధమే నిశ్శబ్దాన్ని పోగొట్టాడు.

రెండవసారి పేలబోయే బాంబులా ఘూర్ణిల్లుతున్న ఆఫీసరు వరండాలోంచే కేకవేశాడు, ప్రతి అక్షరం వత్తి పలుకుతూ, 'విశ్వనాధం' అని. విశ్వనాధం వెనక్కి పరి గెత్తేడు, సార్ అంటూ.

మిగతావాళ్ళంతా ఎక్కువదూరం కలిసి నడవలేదు. వీధి చివరి చేరగానే మార్గాలు విడిపోయాయి. కామేశని డొక్కడిదీ ఒక తోవ, మిగిలిన వారందరిదీ ఒక తోవ.

కామేశం ఒక్కడూ నడుస్తున్నాడు. వీధిలైట్ల నీరసంగ కాలు తున్నాయి. మేఘాలు చంద్రుణ్ని కప్పివేస్తున్నాయి. పొగముంచు తెరలు ఒకటొకటి కావేశాన్ని కప్పివేస్తు న్నాయి. అంచులు కరుగుతూ ముందుకు నడుస్తున్న కామేశం మరీ అస్పష్టంగా ఆకారరహితుడై, మాయని పోదుగాటి మచ్చలా సాగిపోతున్నాడు.

కావేశం వెళ్లిపోయాడు రైలు స్టేషనువైపు. స్టేషన్ చేరాకట ిక్కట్టు కొనుక్కుని ఏ వూరయినా పోవచ్చు-లేక టిక్కెట్టు కొనకుండా ఏరైలు క్రిందయినా పడొచ్చు-అదీగాక పోతే వారం రోజుల్లో గొప్పవాడవడానికి మరేదయినా పుస్తకంకొనుక్కొని రావచ్చు. అవి కేవలం అతనికి సంబంధించిన విషయాలు.

చిన్న కథలకి తొలిమాటలుండవు అంచేత చివర నోమాట. తెలివయినవారూ, చురుకైనవారూ సంఘంలో తమ స్థానాన్ని తామే నిర్ణయించుకోగలరు. కావేశం లాంటి అదృష్టహీనుల్ని ఆదరించగలిగినదే ఉత్తమ సంఘం.

**(యువ దీపావళి, 10.11.1965)**

# పిరికివాడి ప్రేమ

"అల్లాడీ అంబేద్కరూ భారత రజ్యాంగ చట్టం రాసినప్పుడంత ఆలోచించి యుండరు. మేగ్నకార్టాలో సంతకం జెయ్యటానికి కింగ్‌జాన్ అంత సంకోచించి వుండడు. రాజేశ్వర్రావా ఉత్తరం అంత ఆలోచించి రాసి అంతా సంకోచించి సంతకం చేశాడు.

అసలు రజేశ్వర్రావేదీ బాగా ఆలోచిస్తేనే గానీ చెయ్యడు. స్వతహాగా చాలాజాగర్తయిన మనిషి, నిదానం అతని సొత్తు. వయసు చిన్నదైనా దురుసుతనం లేదతనికి. తనకితండ్రి నెల్నెలా పంపించే డబ్బులో ఎంతో కొంత మిగిల్చినా తొందరపడి ఎవరికీ అప్పులివ్వడు. అంత మాత్రాన కేపిటలిస్టు పోకడలున్నా యనడా నికి వీల్లేదు. కమ్యూనిష్టు కాకపోయినా అగ్గిపుల్లా, అరటి తొక్కలాంటి కమ్యూనిష్టు కథలంటే కాలిన ఇల్లూ, ప్రేమ మఠం లాంటి ప్రేమ సీరియల్సుకంటె ఎక్కువిష్టం, అలా అంటే ప్రేమంటే ఇష్టంలేదనీ రసజ్ఞుడుకాడనీ అనడానకి అసలే వీల్లేదు. అసలతని కొంపముంచింది ప్రేమే!

బీయేస్సీ మూడో ఏడు చదువుతున్న రిటైర్డ్ తాసీల్దార్ పరం ధామయ్యగారి రెండోకొడుకు (బీయేస్సీ చదువు తోంది తాసిల్దారు కాదు - అతని కొడుకు) రాజేశ్వర్రావు బియే మొదటి సంవత్సరం

చదువుతున్న సబ్ కలెక్టరు రాఘవేంద్ర రావుగారి జ్యేష్ఠ పుత్రిక రాధని చూడగానే– అంటే ఆమె స్కూలుఫైనలు చదువుతున్నప్పుడే ప్రేమించేడు. ఈ విషయం రాజేశ్వర్రావుకి తప్ప ఇంకెవరికీ తెలియదు. ఇంకొన్ని గంటల్లో అందరికీ తెలిసిపోతుంది ఆ విషయం అచ్చుకొట్టించి పేపర్లు పంచిపెడ్తారు. గోడలమీద మసి బొగ్గుల్తో రాసేస్తారు. టముకు వేయించి చాటించేస్తారు. రాజేశ్వ ర్రావు కొంప యింకొన్ని గంటలు మాత్రమే తేలి ఉంటుంది.

తన ప్రేమవిషయం ఆలోచిస్తున్న కొద్ది రాజేశ్వర్రావుకి మతి పోయేట్టువుంది. రాధని తాను పెళ్ళాడ్డానికి ఏ సాంఘిక ఆటంకాలూ లేవు. ఆమె కిరస్తానీ కిన్నెరకాదు. ముస్లిం ముదిత అంత కంటెకాదు, సతీసావిత్రికి అనసూయకీ రాఘవేంద్రరావు గారికీ డైరెక్టు వారసు. వాళ్ళ శాఖకూడా ఒకటే. రాఘవేంద్రరావుగారు రాజేశ్వర్రావుకి నాలుగు వేళ్ళో; ఒక చెయ్యో విడిచిన మేనమామో ఏదో అవుతారు.

రాధా రాజేశ్వర్రావుల వివాహం ఎవరెవరికి ఇష్టం లేదో చెప్పలేం. ఆ విషయ మెవ్వరికీ తెలియదు కాబట్టి దీనికంతకీ నాదే తప్పు అని నొచ్చుకుంటూ వుంటాడు రాజేశ్వర్రావు

మూడేళ్ళయి రాధ ఊళ్ళోనే రాజేశ్వర్రావు చదువు కుంటున్నాడు. మూడేళ్ళయి ఆమె యింటికి నెల్నెలా వెళుతూనే ఉన్నాడు. ఆమెను చూసినప్పుడే 'మళ్ళా ఎప్పుడు వచ్చేస్తావ్' అని అడక్కుండా ఆమెకి తెలియకుండా పాదాల ముందు తన హృదయం పెట్టేయడం ఆమె చెల్లెలు శారదను చూడగానే 'ఛీ మేనర్లెస్! బ్రూట్!' అని అనిపించుకోడం జరిగింది. అప్పుడు రాధ నల్లటివోణీ వేసుకొని పట్టుపరికిణీ లోంచి పల్చగా పధ్నాలు గేళ్ళు పెరిగిన మొగలి రేకులా ఉండేది.

అప్పుడు తను నల్లదనం రాధ మొహం తెల్లదనాన్ని ఎక్కువ చెయ్యలేని రెండు జడలిప్పుడూ ఉన్నాయి. అప్పుడామె పెదవుల్లో చిక్కుకున్న చిరునవ్వు ఇంకా చిక్కుకొనేవుంది. కాని రాధమాత్రం టెర్లిన్ చీరెల్లోకి కంపెనీ బాడీల్లోకి ప్రమోట్ అయింది. 'ఇన్నైనా నా ప్రేమని వెల్లడి చేయలేని పిరికిపందని' అని తనని తానే నిందించుకుంటాడు రాజేశ్వర్రావు.

రాజేశ్వర్రావు 'పిరికివాడా? మొహమాటా?' అన్న హంశం గురించి నలుగురూ ఎనిమిది రకాల అభిప్రాయాలు వెలిబుచ్చేరు. ఈవేళ 'మొహమాటి' అన్నవాళ్ళు రేపు పిరికి వాడనీ, అట్నించి కూడా అంటారు. కాని రాధమాత్రం ఏ మాటా అన్లేదు.

రాధ రాజేశ్వర్రావుని తనింటిదగ్గరా కాలేజీలోనూ చాలా సార్లు చూసింది. కొన్నిసార్లు మాట్లాడింది. మరికొన్ని సార్లు కాఫీనో, కూల్ డ్రింకో యిచ్చింది. అతన్ని స్నేహితుడుగా గాని, కాబోయే భర్తగాగాని ఆమె పరిగణించ లేదు. ఇంతకీ ఆమెకి స్నేహితులు బహుకొద్దిమంది. వాళ్ళలో మగాళ్ళు ఎవరూలేరు. ఆమె స్నేహబృందంలో ఆడ పహిల్వానులున్నారన్నా నమ్మవచ్చు గాని మొగాళ్ళున్నారంటే నమ్మలేం. ఆమె మితభాషి, తమ మాటలవల్ల ఎవరినీ ఆకర్షించదు. ఆకర్షించేదామె రూపమే. ఆమె ఎలా వుంటుందో ఒక్క ముక్కలో చెప్పాలంటే బహు అందగత్తె అనాలి.

రాధని చూడగానే ఎంతోమంది ప్రేమించారు. ఆమె యిష్టాయిష్టాల్తో నిమిత్తం లేకుండానే అలా ప్రేమించిన వాళ్ళలో ఒకడికి పిచ్చెత్తిపోయింది. మరోడికి బియ్యే మొదటి సంవత్సరం పరీక్ష పొతే వాళ్ళనాన్న చదువు మానిపించి వ్యవసాయంలో గట్లూ పుట్టలూ నరికిస్తున్నాడు. ఆకుర్రాడుకూడా బహు యోగ్యుడు. 'రాధా? రాధా !!' అంటూ పిచ్చికేకలు మనస్సులోనే వేస్తూ, మజ్నూలా గిరిజాలూ గెడ్డం పెంచి వాత గట్టుతవ్వి గోదావరి గట్లంత గట్లు సునాయాసంగా వేసేస్తున్నాడు.

"చూడండి ప్రిన్సిపాలుగారూ! ఆఫ్రికా ఖండంలా మొహం యితనూను! ఇతన్నన్ను ప్రేమించేట్ట" అని ఫిర్యాదు చేస్తుందేమోనని భయపడ్డ పొడుగుగడ్డం ఇంగ్లీషు ట్యూటరు ప్రేమలోపడ్డ షేక్స్పియర్లా తను రాధకి రాసిన ప్రేమలేఖల్ని ఆమెకు చేర్చకుండా బొత్తికట్టి దాచేస్తున్నాడు. పోస్టుచెయ్యకపోయినా, పబ్లిష్ చెయ్యవలసిన ఉత్తరాలవి. వాటిల్లో బ్రహ్మాండమైన కవిత్వం ఉంది.

ఇంతకీ చెప్పవలసిందేమిటంటే రాధని ప్రేమించిన వాడెవడూ సుఖపళ్ళేదు. 'నాపనీ అంతేనేమో' అని తరచు నిరుత్సాహపడేవాడు రాజేశ్వర్రావు.

రాధా, రాజేశ్వర్రావుల ప్రేమగాధ పెద్దదికాదు. అసలు ఒక విధంగా చూస్తే ప్రేమగాథేకాదు, రాధని చూడగానే రాజేశ్వర్రావుకి పట్టుకొచ్చిన ప్రేమ చక్రవడ్డీతో నెల్నెలా పెరుగుతూనేవుంది కాని అతనెప్పుడూ ఆమెతో ప్రత్యేకించిగాని ప్రేమగాగాని మాటాళ్ళేదు. అతను వెళ్ళిన దగ్గర్నుండి వచ్చేదాకా రాధతల్లి శాంతమ్మా తండ్రి రాఘవేంద్రరావుగారో అతనితో టేవుండి మాట్లాడి పంపించేశేవారు. రభసలేకుండా సైలెంటుగానే ప్రేమించడం

రాజేశ్వర్రావుక్కూడా బావుంది. వెళ్ళినప్పుడల్లా రాధతో రెండు పిచ్చాపాటీ కబుర్లు చెప్పడం, ఆమె అందించే గాజుగ్లాసులోని నీళ్ళలోంచి మెరిసే ఆమె ముత్యాలగాజులో, ఎర్రపొడి వుంగరమో చూడ్డం, తర్వాత ఆ ముత్యాలూ, పొడీ గొంతుకలో పడ్డట్టయి నోరుమూసుకోవడం రివాజైపోయింది.

రాధక్కూడా రాజేశ్వర్రావంటే ప్రత్యేకాభిప్రాయం ఏమీలేదు. మర్యాదస్తుడుగా దూరబ్బంధువుగా, జీవితంలో కష్టపడితే ముందుకు రావలసిన వాడుగామాత్రం అతన్ని దూరంనుండి చూడగలిగింది. అసలామె ఏ పరాయి మొగాడ్నీ సన్నిహితంగా చూడలేదు. తన వివాహ విషయంలో తనకి తన తల్లిదండ్రులు పూర్తి స్వేచ్ఛ యిస్తారని ఆమెకు తెలుసు. అంచేత వారికి కష్టం కలిగించేలా ఆమె ప్రవర్తించలేక పోయింది. చిలకల బుష్‌కోటు తొడుక్కునే ఏ జేబులు కొట్టే వాడ్నో, పగలు బంకగుడ్డలూ రాత్రి టెర్లిస్సూట్లూ వేసుకునే కారు మెకానిక్కునో ప్రేమించి అతన్తో రాత్రిళ్ళు పామూపుట్రా అనకుండా పార్కులో గడ్డిలో దొర్లాలనీ చాలీచాలని గుడ్డలు కట్టుకొని హుస్సేన్ సాగరులో ఈదాలనీ ఆమెకు లేదు.

అలాగని ఆమెకు తనజీవితం గురించీ, పెళ్లి గురించీ ఏ అభిప్రాయాలు లేవని కాదు. ఈ బియ్యే పూర్తయ్యేలోగా తన తల్లిదండ్రులకు నచ్చినవాడైనా ఆస్తి, అంతస్తూ చదువూ, సంధ్యా ఉన్నవాడొస్తే పెళ్ళి చేసుకుందామనీ, లేకపోతే పైకి చదివి ఏ డాక్టరో; లెక్చరరో అవాలనీ ఆమె నిశ్చితాభిప్రాయం.

ఆవేళ లక్ష్మివారం. ఇంకొక్క ప్రాక్టికల్ మాత్రం శని వారానికి మిగిలి ఉంది. అప్పటివరకూ అన్ని పరీక్షలూ చాలా బాగా రాశేడు రాజేశ్వర్రావు.

తన జీవితంలో యింత త్వరలో యిన్ని మార్పులు రాబోతున్నాయని తెలియని రాజేశ్వర్రావు నవ్వుతూనే లేచేడు ఆ లక్ష్మివారం ఉదయం. ఆ మధ్యాహ్నం పోస్టు తెచ్చింది పరంధామయ్యగారి ఉత్తరం. పరంధామయ్యగారి ఉత్తరమేదీ భగవస్తోత్రం చెయ్యందేవిప్పుడు రాజేశ్వరరావు. పరంధామయ్యగారు అతన్నెప్పుడూ ఏ ఉత్తరంలోనూ తిట్టలేదు కొట్టలేదు సరిగదా దీవించే రాస్తాడు ప్రతి ఉత్తరం. అయినా తండ్రి పేరుచెప్తే హడల్ అతనికి.

అంతేకాదు. పరంధామయ్య పేరు చెప్తే అతని భార్య పార్వతమ్మక్కూడా హడలే. మిగతా పిల్లలక్కూడా హడలే. పొరుగింటి పిల్లలు అతని కళ్ళ పడకూడదని వెయ్యి దేవుళ్ళకి మొక్కుతారు.

పరంధామయ్య తాసీల్దారీ చేస్తున్న రోజుల్లో కరణాలని కొట్టలేదు. మున్సబులని మర్డర్ చెయ్యలేదు. కాని అంత పనీ చేశేవాడని ప్రతీతి. పిల్లలమాటేమోగాని అతని పేరు చెప్తే పచ్చి మంచినీళ్ళు కూడా గొంతుదిగేవి కావతని సబార్డినేట్సుకి.

పార్వతమ్మ పెళ్ళియిన ఎన్నేళ్ళకి పరంధామయ్య ఆమెకి వంటిట్లో డ్యూటీవేశాడో తేలీదుకాని అతడు రిటైరైనా ఆమె డ్యూటీ వద్దల్లేదు. అమ్ముడైపోయిన హరిశ్చంద్రుడు స్మశానమైనా వదలడానికి కొప్పుకుంటాడేమో కాని ఆమె మాత్రం వంటిల్లు వదలడాని కొప్పుకోదు. నందనవనం, బృందావన్ గార్డెన్సు, తాజ్ మహలు, కాశ్మీరు నరుస్సులు అన్నీ ఆమెకు వంటింట్లోనే వున్నట్టు వుంటుంది.

"ఏడిశావ్‌గాని, సినిమాకి పోదాంరా!" అన్న భర్త మాట వినిపించగానే పట్టుచీరె కట్టుకొని పదినిమిషాల్లో తయారై వీధి గుమ్మంలో ఉంటుందామె. "ఏ హాలు ? ఏ సినిమా? రంగుల్దేనా? బావుంటుందా? నాగేశ్వర్రావు వున్నాడా?" వగైరా ప్రశ్నలామె కనవసరం. "యీ సినిమా గండం దాటించు మహా ప్రభో!" అని ప్రార్థిస్తుందామె పరమాత్ముణ్ని.

రాజేశ్వర్రావుకి ఊహ వచ్చేసరికి తల్లి వంటింట్లో, ఒక బంట్రోతు పెరట్లో; మరో బంట్రోతు వీధి చివరా వదలక పోవడం: హెడ్ గుమస్తా ఎరక పీతలా పక్కగా నడిచి తన తండ్రి దగ్గరికి రావడం చూశాడు. ఈ మనుషుల వింతచేష్టలకి భయమే కారణమని గ్రహించడానికి అతనికి ఎక్కువ టైము పట్టలేదు. ఇంతమంది యోగ్యులు చూసి జడుసుకునే తన తండ్రిని ఎదిరించాలని అతని కెప్పుడూ అన్పించలేదు.

పరంధామయ్యకి కడుపులో కళ్ళు లేవు కబంధుళ్ళా,

అతన్ని చీలిస్తే అతుక్కుపోడు జరాసంధుళ్ళా.

అతను ఏ సీతనూ ఎత్తుకుపోలేదు. రావణాసురుళ్ళా అతను ఓ తెల్లవారు ఝామున మసక చీకట్లో పని మనిషి రాజమ్మ చెయ్యి పట్టుకుంటే యిష్టం లేకపోయినా సీతామ్మోర్లాంటి మడిసి, అగ్గినిప్పు' ఐన ఆమె కేవలం భయంవల్ల లొంగిపోయింది కాబట్టి అతను రావణబ్రహ్మ కానేరడు.

ఏది ఏమైనా పరంధామయ్యగారంటే రాజేశ్వర్రావుకి తగని భయం. ఎర్రటి రంగూ, ఆరడుగుల ఎత్తూ, పల్చటికను బొమ్మలూ చెమటతో తడిసిమెరిసే బట్టతలాగల పరంధామయ్య ఎర్ర పట్టు పంచ కట్టుకొని చేతులున్న కంపెనీ బనీను తొడుక్కుని చేతికర్ర

పక్కని పెట్టి బెర్తునేసిన తనకర్ర యీజీచైర్లో కళ్ళు మూసుకుని కూర్చుంటే ఎవరూ తెగించి ఎదుటపడి అతన్ని మాట్లాడించరు. అతను చారలు లేని పెద్దపులి. జూలు లేని సింహం. రిటైరైన యముడు.

అటువంటి పరంధామయ్య రాజేశ్వర్రావుని శతయుష్షుగా దీవించి ఏమి రాశాడయ్యా అంటే "మీ మామయ్య ఆదివారం తిరపతివెళ్తూ యిక్కడ దిగుతాట్ట. కాబట్టి నువ్వు శనివారం పరీక్ష అయినవెంటనే యిక్కడకి వచ్చేస్తే నువ్వు కూడా అతన్తో తిరుపతి పోవచ్చు. కాబట్టి తప్పవద్దు" అని.

రాజేశ్వర్రావుని ఎవరైనా "పరీక్ష తప్పుతావా; మీ నాన్న మాట తప్పుతావా?" అని అడుగుతే "పరీక్షే తప్పుతాను" అంటాడు సంకోచించకుండా.

శనివారం నాడు పరీక్షఐన రెండు గంటల్లో వున్న రైలు తప్పదు రాజేశ్వరరావు. తప్పుదామని అతనికి లేదు. శనివారం పరీక్షయ్యేక రాధతో కలిసి వీలైతే సినిమాకీ లేక పోతే బీచికి వెళ్దామనీ, "నిన్ను ప్రేమిస్తున్నాను రాధా! నువ్వు గ్రహించనేలేదా? నన్ను కటాక్షించు. పెళ్ళిచేసుకో. లేకపోతే బైరాగిం చేస్తాను. గళాసుడు గరళం గటగటా తాగి చచ్చి దయ్యమై నిన్ను పట్టు కుంటాను" అని నోటితో కాకపోయినా కళ్ళతో పలుకుదామనీ అతను యిదివర్కు వేసుకున్న ప్లాను రద్దుచేసుకున్నాడు. అతని కిప్పుడున్న ఒక్క కోరికా ఊరువిడిచి వెళ్ళేలోగా రాధని ఒక్కసారి చూద్దామని. రేపు శుక్రవారం వెళ్ళొచ్చు. కాని రాధ యింటి దగ్గర్లేకపోతే అన్న ఆలోచన ఆ లక్ష్మివారం సాయంత్రం రాజేశ్వ ర్రావుని రిక్షా ఎక్కించింది.

లక్ష్మివారమంటే రాజేశ్వర్రావుకీ, సాయిబాబాకీ కూడా ఎంతో యిష్టం. అసలు రాజేశ్వర్రావు పుట్టింది లక్ష్మివారమే. అతను మొదటిసారి రాధను చూసిందికూడా లక్ష్మివారంనాడే.

కాని ఆ లక్ష్మివారం రాధ రాజేశ్వర్రావు కంటబళ్ళేదు. రాజేశ్వర్రావు రాధయింటి వీధివరండాలోకి వచ్చే సరికి రాఘ వేంద్రరావుగారూ అతని భార్య ఇందిరమ్మా హాల్లో అతనిగురించి మాట్లాడు కుంటున్నారు. ఏ యిద్దరైనా ఒక గదిలో మాట్లా కుంటూవుంటే పొంచుండివినడం పాపం. ఆ యిద్దరూ భార్యా భర్తలైతే మరీ ఘోరపాపం. అయినప్పటికీ ఆ యిద్దరూ భార్యా భర్తలైనా కాకపోయినా పొంచున్న వాడిగురించి మాట్లాడకుంటూ వుంటే పొంచున్న వాడు రవణ మహర్షయినాసరే వవవేకా నందుడైనా సరే పొంచుండి వినకమానడు. ఆ యిద్దరూ భార్య భర్తలైపొంచున్న వాడు, వారు తనకు అత్తమామలైతే బావుణ్ణు అనుకుంటూ వుంటే వాడు దేవుడైనా సరే వినక మానడు.

రాజేశ్వర్రావు దేవుడూ, వివేకానందుడూ, రవణ మహర్షీ కాదు కాని "ఒక్క క్షణం దేవుణ్ణయినా బావుణ్ణు మాయమై విందును వీళ్ళమాటలు" అనుకొని మాయం కాకుండానే విన్నాడు వాళ్ళ మాటలు. వింటూన్న కొద్దీ "అంతా మాయ" అనిపించిం దతనికి.

రాఘవేంద్రరావుగారూ, అతని భార్యామణీ అనుకున్న మాటల పర్యవసానం ఏమిటంటే "తమ పెద్దకూతురు రాధ పెళ్ళి అర్జంటుగా చెయ్యాలి. చిన్న కూతురు పెళ్ళికి రెండేళ్ళు ఆగొచ్చు. రాజేశ్వర్రావుకి అల్లుడిగా అర్హతలు వున్నాయ్. కాని రాధకీ అతనికీ రెండేళ్ళే భేదం, వాళ్ళిద్దరికీ మరీ దగ్గరైపోతుంది కాబట్టి శారదకి యుక్తవయస్సు వచ్చినప్పుడు అతనికిచ్చి పెళ్ళి చెయ్యొచ్చు" అని.

ఈ మాటలు విన్న రాజేశ్వర్రావు కేమనిపించింది? ఐదు నిముషాలు ఏమీ అనిపించలేదు. ఆ అయిదు నిమిషాలూ అతను ఊపిరి పీలుస్తున్న శవం. కాలం స్తంభించిపోయింది. రాజేశ్వర్రావుకి ఏమీ వినిపించలేదు. కనిపించడం లేదు.

కాని ఆ అయిదు నిమిషాలయ్యేక అతనికి చాలా వినిపిం చడం. కనిపించడం మొదలు పెట్టేయి, మొదటవినిపించింది అతని హృదయంలోని రాక్షసులు ఆర్కెస్ట్రా.

మొదట కనిపించింది మంచులాంటి పొగ. ఆ పొగ క్రమేపీ పల్చబడింది. దూరంగా లంకంత పెండ్లి పందిట్లో పురోహితుల మెరిసే కళ్ళూ, ఇంకా ఆతర్వాత కన్యాదాతలుగా ముస్తాబైన రాజేశ్వర్రావుగారూ ఇందిరమ్మా పీటల మీద కూర్చున్నారు. వారికిముందు ఒక తెర. తెరవతల కూర్చున్న మనిషి కాళ్ళు రాఘవేంద్రరావుగారు మంత్ర సాక్షిగా కడుగుతున్నారు. తెర పైకి సాగి కన్పిస్తోంది. ఎర్ర పంచలో వున్న పరంధామయ్య చేతి కర్ర పక్కవాడికిచ్చి తన కంపెనీ బనీసు విప్పుకుంటున్నాడు. పెళ్ళికూతుర్లా ముస్తాబయింది చిన్నపిల్ల శారద.

శారదని రాజేశ్వర్రావు మొదట చూచినప్పుడా పిల్ల గౌనులు తొడుక్కుంటూ థర్డుఫారం చదువుతూ వుండేది. తన పన్నెండో ఏట. అప్పుడాపిల్ల రాజేశ్వర్రావు దృష్టిలోనూ అందరి దృష్టిలోనూ చిన్నపిల్ల. రాజేశ్వర్రావు దృష్టిలో ఆ పిల్ల యిప్పటికి చిన్నపిల్లే.

ఎవరో తెర తొలిగించారు. రాజేశ్వర్రావు తనకళ్ళని తానే నమ్మలేక పోయాడు. తెర అవతల కూచొని కాళ్ళు కడిగించుకుం టున్నది తనే. ఇంతలో సర్వం అర్థం ఐపోయింది. మళ్ళీ ఏమీ అర్థం కావడం మానేసింది. మళ్ళీ రాక్షసుల బృందగానం ఆర్కె స్ట్రాతో సహావినిపించింది.

"ఇక నేనేమీచూళ్ళేను, వినలేను. బాబోయ్ యీ పెళ్ళా పండి, రాఘవేంద్రరావు బాబూ! నీ పెద్దపిల్లకి నీకూ చెరో నమస్కారం. నీ చిన్నపిల్లని మాత్రం నా మెడక్కట్టకు బాబ్బాబూ! నీకు పుణ్యం వుంటుంది. కావాలంటే నేను పెళ్ళి మానకు నయినా ఆ పిల్లకి బేషైన సంబంధం తెస్తాను. బిర్లా మనవణ్ని తెమ్మన్నా తెస్తాను. బీరేన్‌మిత్రా కొడుకుని తెమ్మన్నా తెస్తాను. కాని బాబ్బాబు నన్ను వదిలిపెట్టెయ్" అని గట్టిగా అరవాలని పించింది రాజేశ్వర్రావుకి.

ఆ తర్వాత తన ఆలోచనలు తనకే బాధ కలిగించాయి. ఛ! ఛ ! ! శారదను వదిలించుకుందికి రాధను వద్దన్నాడా? తను ఎంత స్వార్థపరుడూ? ఎంత నీచుడు? రెండేళ్ళు కాదు యిరవై రెండేళ్ళాగమన్నా అగుతాడు రాధనిస్తే. తను బిర్లా, బిరేన్ మిత్రా అంత అవమన్నా అవుతాడు ఆ పిల్లనిస్తామంటే.

రాధ గురించి ఆలోచిస్తూ వుంటే రాక్షసుల మ్యూజిక్కూ, పిశాచాల డాన్సూ వినిపించడం మాని "ఎంత సేపయిందోయ్ వచ్చి" అన్న రాఘవేంద్రరావుగారి పలకరింపు వినిపించింద తనికి. ఎంత సేపయిందో తెలీక పోయినా "ఇప్పుడేనండీ" అంటూ హాల్లో ప్రవేశించేడు రాజేశ్వర్రావు రాధ యింట్లో లేదనీ, రెండు మూడ్రోజుల్లో ఏదో ఎక్స్‌కర్షన్‌కి వెళ్తుందనీ తెలుసు కున్నాడు. తను శనివారం సాయింత్రంవెళ్ళి పోతున్నానని, మర్రా లేనని వాళ్ళకి తెలియజెప్పి తర్వాత శలవు తీసికొని బయట పడ్డాడు.

బైటపడ్డ రాజేశ్వర్రావుకి జైల్లో పడ్డట్టనపించింది. మసక చీకట్లో తన గదిచేరి నీరసంగా పక్కమీద వాలిపోయాడు. భయంకరమైన ఆలోచనలు అతన్ని వెర్రెత్తించేయి, యింకొంచెం సేపుంటే పిచ్చిపట్టేట్టువుంది ఏదైనా చెయ్యాలి. ఏదైనా చేసెయ్యా లనిపించిందతనికి.

సిగరెట్టు అలవాట్లేని రాజేశ్వర్రావు తన రూమ్మేటు సిగరెట్టు తీసి "యీ రూమ్మేటు గాడికి తాగుడలవాటున్నా బావుణ్ణు అంచ క్కా తాగి పడుకుందును" అనుకుంటూ సిగరెట్టు అంటించేడు. లైటు లేని చీకటి గదిలో తెల్ల సిగరెట్టు పొగ బద్ధకంగా లేచి పల్చబడి పోతోంది రాజేశ్వర్రావు రక్తంలా. సిగరెట్టుకు దగ్గ వచ్చినా ఆలోచన స్పష్టపడింది. బుర్ర పని చెయ్యడం ప్రారంభిం చింది రాజేశ్వర్రావుకి.

తన కర్తవ్యం సుళువుగానే బోధపడిందతనికి ముక్కులో వేళ్ళు పెట్టుకునే శారదని వద్దని చెప్పడానికి కొన్ని ఏళ్ళ వ్యవధి వుంది. వ్యవధిలేంది రాధని మెడకు కట్టమని అడగడానికే. మీన మేషాలు లెక్కపెడుతూ కూర్చుంటే రాధని ఏ.ఐ.ఎ.యస్. గాడో తన్నుకుపోతాడు అదితథ్యం, కాబట్టి రాధమీద తనకున్న ప్రేమ వ్యక్తం చెయ్యాలి ముందు ఎవర్తో చెప్పాలి?

పరంధామయ్యగారితోనా? నయం. అంతకంటె ఆ ఐ.ఎ. యస్. వాడితోటి "బాబ్బాబు! నీ క్కాబోయే పెళ్ళాన్ని నేను ప్రేమిం చాను కాబట్టి నువ్వు పెళ్ళాడకు. వీలైతే నాకిచ్చి పెళ్లిచెయ్" అనడుగుతే వాడైనా తన్నకుండా వదల్తాడేమోగాని పరంధా మయ్యగారు మాత్రం తోలు వలిచేస్తారు తన ప్రేమ గాథ వినగానే.

ఇక రాఘవేంద్రరావుగారితో చెప్తే? ఊహుఁ! ఏం లాభం లేదు. వినడు తనో పెద్ద సెక్సాలజిష్టనుకుంటున్నాడు. అతని దృష్టిలో భార్య భర్తకన్న అధమం పదేళ్ళు చిన్నదై ఉండాలి. రాధకి తనకి వ్యత్యాసం రెండేళ్ళేనిట? దగ్గర దగ్గర మూడుం టుంది, తనకంటె పెద్ద ఆడదాన్ని పెళ్ళాడిన షేక్‌స్పియర్ కావ్యాలు రాయలా? ఇంతకి రాఘవేంద్రరావు మరో ఎత్తుమీద వున్నాడు. ఎంతైనా సబ్కలెక్టరుకదూ? అంచేత ఐదేళ్ళు పోయేక ఆ చిన్న కూతురు గుంటని తన మెడకి కట్టడానికి పంచవర్ష ప్రాణాళిక వేశేడు. అతనితో చెప్పి ఏం లాభం లేదు.

పార్వతమ్మతో చెప్తే? పర్వతంతో చెప్పినా ప్రయోజనం వుంటుందేమో కాని ఆమెతో మొరపెట్టుకొని ఫలితం లేదు.

కాబట్టి, (బైప్రోసెస్ ఆఫ్ ఎలిమినేషన్) మిగిలింది రాధ మాత్రం. ఆమెతోటే చెప్పాలి. అనలిన్నాళ్ళూఆమెతో చెప్పక పోవడం తనదే బుద్ధి తక్కువ, ఆవిడకూడా తనని మనసులో ప్రేమిస్తోందేమో? ప్రేమిస్తే తన ప్రేమ ముందుగా వెలిబుచ్చ నందుకు నిందించదు కదా? నిందించినా బంధించినా ఆమెతో చప్పక తప్పదు, "చెప్పేస్తాను. ఏం చేస్తుందేం?" అని తన్ని తానే ప్రశ్నించుకున్నాడు. ముఖస్తంగా చెప్తే లాభం లేదు. అంచేత ఉత్తరం రాసెయ్యాలి.

చీకట్లో పడుకునే రాధకి తాను రాయవలసిన ఉత్తరానికి చాలా ముసాయిదాలు మనసులోనే రాశేడు.

అంబేద్కరూ, అల్లాడీకంటే బాగా ఆలోచించి ఆఖరికి ఒక ముసాయిదా రాసేసరికి రాత్రి పదిన్నరయింది. కింగ్ జాన్‌కంటె సంకోచించి సంతకం చేసేసరికి పదకొండున్నరైంది.

హాస్టలు కాంపౌండుకి వంద గజాల దూరంలోవున్న పోస్టు డబ్బాలోఉత్తరం పడేసేవరకూ ధైర్యంగానే వున్నా డతను. ఉత్తరం పడేస్తున్నప్పుడుతన హృదయంలో వీశ గుండు పడ్డట్టయింది. కళ్ళు చీకట్లు కమ్మేయి. కాళ్ళు సత్తువ కోల్పోయి తన్ని మొయ్యలేక పోతున్నాయి, తను బలహీనంగా కృశించిపోయి చిన్నవాడై పోతున్నాడు, పోస్టుడబ్బా కుతుబ్‌మీనారంతా పెరిగి లీనింగ్ టవర్లా తన వైపువాలి తనమీద పడబోయింది. డబ్బాలో ఉత్తరాలు తమని తామే రాజేశ్వర్రావు కర్థం కాని భాషలో గట్టిగా చదువుకోవడం ప్రారంభించేయి. వాటిల్లో లౌడ్‌స్పీకర్లా చదవడం మొదలెట్టింది రాధ ఉత్తరం. ఇక అక్కడ ఆగలేని రాజేశ్వర్రావు ఫోర్ మినిట్ మైలర్లా హాస్టల్ వేపు పరిగెత్తాడు. దార్లో టీ తాగి వస్తున్న స్నేహితులు గుంపులు గుంపులుగా అడ్డుకోబోతే "దెయ్యం కొట్టబోయిందని, దొంగపట్టుకోబోయేయేదని, పామని, పోష్టని" పిచ్చికేకలు వేసి పారిపోయేడు. ఇతని బాధ తెలియని స్నేహితులు అతను పామును పోస్టు చేశేడనో దొంగదెయ్యం జేబు కొట్టేశేడనో అనుకున్నారు.

పరుగున వచ్చి పక్క మీద వాలిన రాజేశ్వర్రావుకు నిద్రపట్టిందో లేదో అతనికి తెలీదు. కాని కలో, ఆలోచ నలో ఐదంకాల నాటికలా వచ్చింది.

సీన్ వన్ :

ఏదో తెలిసిన స్థలం. స్థలంపోల్చుకోడానికి వీల్లేనంత కాంతి కోటిసూర్యులు ప్రకాశిస్తున్నట్లు. క్రమేపీ ప్రిన్సిపాలు ఆఫీసు తాలూకు పచ్చగా మెరిసే యిత్తడి గడియ. కాలేజీ జవాను నీలిరంగు దవాలు కనిపిస్తున్నాయి. రాజేశ్వర్రావు దవాల్ని తప్పించి వెళ్లిపోతున్నాడు. దవాలు పక్కనుంచి రెండుచేతులు లేచి అతన్ని ఆఫీసులోకి తోసెయి. స్ప్రింగు డోర్స్‌లోంచి దూసుకుపోయిన రాజేశ్వర్రావు ప్రిన్సిపాలు గారి చేతుల్లో పడ్డాడు. 50 ఏళ్ళు దాటిన సినిమా ప్రిన్సిపాల్లా ఉన్న అతను సోడాబుడ్డి అడుగుల్లా వున్న తన కళ్ళజోళ్ళోంచి జాలిగా రాజేశ్వర్రావుని చూసి, యింకా జాలిగా అతని భుజం తట్టి "సారీ ! రాజా ! ఆ సబుకలెక్టరుగారు నిన్ను ఫర్‌లైఫ్ డిబార్ చెయ్యమని భల్లూకంలా పట్టు పట్టేరు. కాని నీ మీద వున్న అభిమానంకొద్దీ నీకు టి.సి. యిచ్చి పంపించేస్తున్నాను. క్లాసులో అందరికన్న ముందున్న నువ్వు రాధ వెనక పడతావనుకోలేదు. మరో కాలేజీలో చేరి ఫస్టుక్లాసులో వచ్చే ఏడాదైనా పాసై మా కాలేజీకి కీర్తితే" అంటూ ఏదో మడిచిన కాగితాన్ని రాజేశ్వర్రావు జేబులో పెట్టేరు.

సీన్ టు :-

రాజేశ్వర్రావు వీధి. ఎర్రగా మిట్టమధాహ్నం కాంతిలో ఎర్ర పంచె, కంపెనీ బనీను, చేతికర్రతో సహాకాలి పోతున్నట్టు పరం ధామయ్యగారు కనిపిస్తున్నారు. గదిలో చీకట్లో ఔట్ ఆఫ్ ఫోకస్‌గా బెదురు కళ్ళతో లోపలిగోడకు చేరగిలబడి వున్నారు పార్వతమ్మ గారు నాజూగ్గా మాసిన లూజుపైజామా, ఎంబ్రాయిడర్డు షర్టు తొడుక్కొని ఎయిర్ బేగ్ పట్టుకొని తలొంచుకుని నడుస్తున్న రాజేశ్వర్రావు వీధిమెట్టు ఎక్కుతూ తలెత్తేడు. చేతికర్ర ధృఢంగాలేచి వీధి రెండవ వేపు ట్రాఫిక్ సిగ్నలిచ్చింది. భారమైన అడుగుల్తో బరువైన కళ్ళతో రాజేశ్వర్రావు మెట్లుదిగి పోబోతూవుంటే పార్వతమ్మ తన కన్నీళ్ళు కనబడేట్లు ఫోకస్‌లోకి వచ్చింది.

సీన్ త్రీ :-

ఆకుపచ్చని పెళ్లిపందిర. లోపల డెకరేషన్ లైట్లు అన్ని రంగు ల్లోనూ వెలుగుతున్నాయి పెళ్ళయిపోయి చాలా సేపయిదన్నట్టు నేలనున్న తమలపాకులు, అక్షింతలు, ఖాళీకుర్చీలూ సూచిస్తు న్నాయి. ఊలు కంపెనీ ఎడ్వర్ టైజు మెంటులావున్న ఐ.ఎ.యస్. గారూ, రాధా, రాఘవేంద్రరావూ ఇందిరమ్మగార్ల పాదాలకి నమ స్కరించి తమ హనీమూన్ కారువేపు నడుస్తున్నారు. ఆ ఐ. ఎ. యస్. గాడు రాజేశ్వర్రా వూహించినట్టు చౌఎన్‌లై తమ్ముళ్ళా కాకుండా, దేవానంద్‌లా మహ బావున్నాడు. చీకట్లోవున్న రాజేశ్వ ర్రావు కళ్ళుమూసుకుని తన రెండు చేతులూ ఎత్తి వూపిరిబిగబట్టి దీవిస్తూంటే రాధ కారుఎక్కి పెద్ద శబ్దం చేస్తూ తలుపు వేసేస్తుంటే చక్కటి గిటార్ ఏడవులో కారు పరిగెట్టి లీనమైపోయింది.

సీన్ ఫోర్ :

అన్ని పక్కలా నీలి చీకట్లు, ఎన్నో స్ట్రీట్ లేంప్స్ మాత్రం తమ స్తంభాల క్రిందనే సున్నాలు చుట్టినట్టు కాంతి నిస్తున్నాయి. వచ్చేపోయే అస్పష్టమైన కార్లలో దూరానున్న దీపాలు నీరసంగా ప్రతిబింబిస్తున్నాయి. ఒక స్ట్రీట్ లైటు గుండ్రని కాంతిలో మాసి పోయిన టెర్లిన్ గుడ్డల్లో రాజేశ్వర్రావు అతని కళ్ళచుట్టూ నల్లని

చక్రాలు అతని ఆరోగ్యం బాగులేదని సూచిస్తున్నాయి. పక్కని వివిటి 69 పెట్టుకొని తనమనసు బాగులేదని అందరికీ చెప్తూ వీధికుక్కకు రొట్టె తినిపిస్తూంటాడు రాజేశ్వర్రావు. ఇద్దరు అందమైన దొరల పిల్లలు అతనివైపు జాలిగా చూస్తుంటారు. దూరాన ఏదో సేడ్‌సాంగ్ వినిపిస్తూంటుంది. ఎవరో దొరా, దొరసానీ డ్యాన్సు చేస్తున్నట్టు నడిచి పోతుంటారు. 'అమాయ కులు' అన్నట్టు రాజేశ్వర్రావు వాళ్ళవేపు జాలిగా ప్రేమగా చూస్తాడు.

సీన్ ఫైవ్ :

మళ్ళా పెళ్ళి పందిర. సన్నాయివాడు గొంతుబిగించు కొంటు న్నాడు. డోలువాడు చెవఁటలు కక్కుతున్నాడు. పెళ్లి హడావిడిలా అంతా అట్నించిటూ ఇట్నించటూ పన్లేని వీధి కుక్కల్లా తిరుగుతున్నారు. పెళ్ళి పీటల మీద కూర్చునున్నాడు రాజేశ్వ ర్రావు. పక్కన ఎక్స్‌టెన్షన్ వచ్చిన యముడిలా పరంధామయ్య. నెమ్మదిగా అడుగులు వేస్తూ పెద్దముత్తయిదు వలు పెళ్లికూతుర్ని తీసుకువస్తుంటారు. పెళ్లి కూతురు మొహం పల్చటి మేలి ముసుగులో వుంటుంది. 'ఆమె ఎవరో' అన్న కుతూహలంతో మేలిముసుగులోంచి చూస్తాడు రాజేశ్వర్రావు. చాక్‌లెట్ చప్పరిస్తూ, ముక్కులో వేలుపెట్టుకున్న శారద కనిపిస్తుంది.

ఇక చూళ్ళేక యీకలో, ఆలోచనో రద్దు చేశాడు రాజేశ్వర్రావు.

❖ ❖ ❖

ప్రాక్టికల్ పరీక్షకు వెళ్తే ప్రిన్సిపాలూ సబ్‌కలెక్టరూ, సబిన్స్ పెక్టరూ ఒక్కుమ్మడిగా చుట్టుముట్టేస్తారని పరీక్ష అయేవరకూ తనరూములోనే వుండిపోయి పరీక్షవగానే విడుదలైన ఖైదీలా రైలుస్టేషనుకి పరిగెత్తేడు రాజేశ్వర్రావు.

రైలు దిగిన రాజేశ్వర్రావుని 'పరీక్షలెలా తగలెట్టేవోయ్' అని పలకరించేరు పరంధామయ్యగారు. 'బాగానే రాశేను' అంటూ తప్పించుకొని ఇంట్లోకి పారిపోయేడు రాజేశ్వర్రావు.

మర్నాటినుండి ప్రిన్సిపాలుగారు తన్నిడిస్మిస్ చేసినట్టు రాసే ఉత్తరంకోసం వీధిచివర్నే పోస్టుమేన్‌కోసం కాసేవాడు రాజేశ్వ ర్రావు. ఖూనీ కేసులో ముద్దాయికి తీర్పు వాయిదా పడినకొద్దీ ఆదుర్దా ఎక్కువైనట్టు, ప్రిన్సి పాలుగారి ఉత్తరం రాకపోవటం వల్ల రాజేశ్వర్రావు గాభరా ఎక్కువవడం మొదలెట్టింది.

ఎదురుదెబ్బకు సిద్ధమవుతున్న అతనికి వెనకపోటు పొడిచి నట్టయింది. రాఘవేంద్ర రావుగారు పరంధామయ్యకు రాసిన ఉత్తరం పోస్టుమేన్ తనకివ్వగానే, పరంధామయ్య గారు తనపీక తీసేస్తారని తెలిసినప్పటికీ ఆ ఉత్తరం అతని చేతిలో పెట్టక తప్పలేదు రాజేశ్వర్రావుకి. పరంధామయ్య గారు కవరు చించి ఉత్తరం చదువుకుంటుంటే లోపల వరండాలో నిలబడి కిటికీ లోంచి క్రీగంట ఆతని రియేక్షన్ కనిపెడుతూ నిలబడ్డాడు తన కాళ్ళు నిలబడమంటున్నా.

ఇతరులకి కష్టం సుఖం ఒక్కలాగే కలిగించే వేదాంతి పరం థామయ్యగారు, కాబట్టి ఉత్తరం చదువుతున్నప్పుడతని మొహంలో ఏ ఫీలింగూ లేదు. ఉత్తరం పూర్తిచేసిన వెంటనే కాని ఏమేవ్' అని అతను గావుకేక పెట్టగానే ఎక్కడ లేని ఫీలింగూ వచ్చింది రాజేశ్వర్రావుకి 'ఏదో వ్యవహారం మాట్లాడ్డానికి మీ రాఘవేంద్రవన్న రేపొస్తాట్ట మెయిలుకి. కాస్త ఆ సంగతేదో చూడు' అని అతననేసరికి అన్ని ఫీలింగులూ రాజేశ్వర్రావుని కొన్ని క్షణాలపాటు వదిలేశాయి. అప్పుడతను నిర్గుణబ్రహ్మ.

❖ ❖ ❖

పరంధామయ్యగారి ఊరి జనాభా రాఘవేంద్రరావు గారి రాకవల్ల పెరగలేదు ఆ ఉదయమే రాజేశ్వరావు, ఊరు వదిలెయ్య బట్టి. అతిథి మర్యాదలయ్యాక రాఘవేంద్ర రావు అంతా చెప్పే శారు. 'ఏదో కాస్త వయసులు దగ్గరైపోతాయని సంకోచించేం కాని యింకేం లేదు. తీరా చూస్తే వాళ్ళిద్దరికి దగ్గర దగ్గర మూడేళ్ళు తేడా వున్నట్టుంది. కాబట్టి బావగారూ! తమరు 'సహీ' అంటే యీ వైశాఖంలోనే 'శుభం' అనిపిం చేద్దాం' అన్నారాయన.

సంగతంతా విన్నాక 'అయ్యో! వెర్రి నాగమ్మ' అంది పార్వ తమ్మ. 'వెర్రినాగమ్మ కాకేం?' అన్నారు తన కొడుకు ప్రేమ పాఠాలు మొదలు పెట్టినందుకు విచారించడమో, పెద్ద సంబంధం వచ్చినందుకు సంతోషించడమో తెలియని పరంధామయ్య గారు.

'ఇంతకీ వెర్రి నాగమ్మని నేను. కుర్రాడి మనసు మూడేళ్ళ యినా కనిపెట్టనందుకు' అన్నారు రాఘవేంద్రరావు గారు. ఆ తర్వాత రాజేశ్వర్రావు పరీక్షకి వెళ్ళలేదని అతని క్లాసుమేటు ద్వారా తెలుసుకొని పరంధామయ్యగారితో సహా అంతా నవ్వు కున్నారు అతని భయానికీ, భక్తికి.

ఇల్లు వదిలిన రాజేశ్వర్రావుకి మనసులో యే సంకోచంలేదు తనదగ్గరున్న రూ. 150 లు, ఖర్చయ్యేవరకూ హైదరాబాదులో తిరగడం, కర్చయ్యేలోగా తన కే వుద్యోగం దొరక్కపోతే రైలుకింద బుర్రపెట్టటం అతని ఖచ్చితమైన పథకం. అతని దగ్గరున్న

డబ్బులో రూ 150లు అప్పుడే ఖర్చయిపోయింది. అతను రైలు కింద పడ్డానికి యింక నాలుగు రోజులు దాటదు.

ఇల్లు విడిచిన నాలుగోరోజు పేపర్లో తనకోసం రాఘవేంద్ర రావుగారూ, పరంధామయ్యగారూ ప్రకటన చేశారు.

తన యిష్ట ప్రకారమే అన్నీ జరుగుతాయనీ కాన వెంటనే వచ్చెయ్యమని ప్రకటనలోని హంశం. చచ్చేలోగా రాధని చూడ దల్చుకోని రాజేశ్వర్రావు ఆమె గురించి తన అభిప్రాయం మార్చు కొని రైలెక్కాడు తనూరికి.

❖ ❖ ❖

పరంధామయ్యగారితో పరిష్కారం చేసుకున్న రాఘవేంద్ర రావుగారు మరో నాల్రోజులు ఆ చుట్టుపక్క లున్న బంధువు లందర్నీ చూసి మరీ యిల్లు చేరేరు ఆరోనాటికల్లా.

ఈ సంబంధం యేమౌతుందా అని యెప్పుడూ ఆరాట పళ్ళేదు రాధ. తన తలిదండ్రులకు నచ్చితే తనకూ నచ్చినట్టే నని ఆమె అభిప్రాయం. కాని తండ్రినోట జరిగిన సంగతంతా విన్నాకమాత్రం ఆ అభిప్రాయం మార్చుకుంది.

తన భావిభర్త జాతీయ పతాకం నోట కరుచుకొని మంచు గొడ్డళ్ళూ తాళ్ళూ పట్టుకొని హిమాలయాలు ఎక్కఖ్ఖర్లేదు. ఖడ్గ మృగంతో పోరి దాని కొమ్ము సరిచెయ్య నవసరం లేదు. ప్రిన్సి పాలుగారి మొహంలో సిగరెట్టుపొగ ఊదక్కర్లేదు.

కాని... కాని ప్రేమలేఖ రాసినంత మాత్రాన ప్రాక్టికల్ పరీక్ష ఎగ్గొట్టేటంత పిరికివాడు కాకూడదు. తన ప్రియురాలి తండ్రి వస్తున్నంత మాత్రాన ఇల్లువిడిచి పారిపోయేటంత భీరువు కాకూడదు. జీవితం అంటే ఒక సమరం ఆమె అంచనాలో. ధైర్యవంతుణ్ని లక్ష్మి వరించినా మానినా పిరికి వాణ్ని మాత్రం పరిణయ మాడదు.

తన భావిభర్తకి తన తండ్రితో 'నేను ఫలానా అమ్మాయిని పెళ్ళాడుతాను' అని చెప్పేపాటి ధైర్యమైనా వుండాలి. మగసిరి లేనివాణ్ని తాను చేపట్టలేదు. అటువంటివాణ్ని కట్టుకొని సుఖ పడలేనన్న ఆలోచన రాగానే క్షమించండి నాన్న గారూ! నే నా పిరికిపందను పెళ్ళాళ్ళేను' అనేసింది రాధ ఖచ్చితంగా – వివాహ విషయంలో ఆమె మాటకు ఎప్పుడు ఎదురాడరు ఆమె తలి దండ్రులు.

**(31.12.1965)**

# వెయ్యని ప్రశ్న - ఇవ్వని జవాబు

ఆ రోజు రాధకి బాగా జ్ఞాపకముంది. ఆ సుదినం ఆమె హృద యంలో చెరగని ముద్రవేసి పోయింది. నాడే ఆమెకు తన భావి భర్తతో విచిత్ర పరిస్థితుల్లో పరిచయమవడం, ఆ పరిచయం మొదట ప్రణయంగానూ ఆ తర్వాత పరిణయంగానూ మారడం జరిగింది. ఆ రోజు తన జీవితంలో ముఖ్యమైనదానిగా నాడే గుర్తు పట్టలేకపోయినా, త్వరలోనే దాని ప్రాముఖ్యతని గుర్తించి దాని వివరాలు మధుర స్మృతులుగా తన హృదయంలో దాచు కుని వీలైనప్పుడల్లా వివరాలు బైటకి తీసి వివరంగా చూసి మళ్ళీ హృదయంలో పెట్టి తాళం వేస్తుందామె అనాడు.....

ఆనాడూ రాధా, జానకి, కమలా, అరుణా ఆఖరుసారి విశాఖ పట్నం సముద్రపొడ్డున కూర్చున్నారు. తమ స్నేహితురాలు నిర్మల పెళ్ళికి విజయనగరం వెళ్ళి తిరుగు ప్రయాణంలో విశాఖ పట్టణంలో వాళ్ళు గడిపిన మూడ్రోజుల్లోనూ ఆఖరు రోజది... మర్నాడే హైదరాబాదు వెళ్ళిపోవాలి వాళ్ళంతా, హైదరాబాదు చేరినవెంటనే తాత్కాలికంగా ఆగిపోయిన తమ యాంత్రిక జీవి తాలు మళ్ళీ ఆరంభమవుతాయి.

నిద్ర పూర్తిగా తీరకుండానే లేవడం – రుచిలేని కాఫీ – విసుగుపుట్టించినా తప్పనిసరైనా ముస్తాబు – పది గంటల తొందర భోజనం – చెమటలు కక్కించే బస్సు క్యూలు – అసు పత్రిని గుర్తుకు తెచ్చే గోడల ఆఫీసు బిల్డింగూ – ఆఫీసులో తోడేళ్ళ చూపుల ఆకలీ – కొక్కిరి గీతలు పెడ్తూ పరిగెత్తే పెన్నిళ్ళ విరిగిన ముళ్ళూ–తలని బద్దలు చేసే టైపు మెషిన్లలోహపు చప్పుడూ – ఆనందం యివ్వని వాచీకొట్టే అయిదుగంటలూ – తమకంటే చిన్న వయస్సుగల మగ స్టూడెంట్లు తమని ఆకర్షిం చడానికి బస్సుల్లోనూ, సినిమాల్లోనూ, చేసే వెకిలిచేష్టలూ – అలసిన పరుపులూ–తీరని నిద్రా–తోటి స్త్రీలలా లేమనే వ్యథా – ఇవీ వారి హైదరాబాదు జీవితాలు.

వాళ్ళెవరికీ సిగరెట్లు కాల్చాలనీ, షాంపేను తాగాలనీ సిని మాల్లో వెయ్యాలనీ, స్విట్జర్లాండు వెళ్ళాలనీ కోరికలు లేవు. తమకు వున్నా సాదా దుస్తులు వారికి అశాంతి కలిగించవు. జీతాలు పెంచమని వారు కోరలేదు, పన్నులు తగ్గించమని కోరలేదు. సిటీ బస్సులు యెక్కువ చేయమని గాని, రేషనింగు పెట్టమని గానీ, కాంగ్రెస్ గవర్నమెంటుని రాజీనామా యివ్వ మనిగాని వారు కోరలేదు.